వాగులో కొట్టుకుపోయిన ప్రేమజంట


గల్లంతైన బక్క శ్రావ్య

గల్లంతైన యువతి.. ప్రాణాలతో బయటపడిన యువకుడు

- స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గడ్ వైపు వస్తుండగా ఘటన
- యువతి కోసం రెస్క్యూ టీం గాలింపు
- కన్నీరుమున్నీరవుతున్న యువతి తల్లిదండ్రులు

7


హంటర్ రోడ్‌లో ప్రజలను తరలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


జలమయమైన వరంగల్ ప్రాంతం ఏరియల్ వ్యూ



భట్టుపల్లి రోడ్ మైసయ్యనగర్‌లో చిక్కుకున్న ప్రజలను ఒడ్డుకు చేరుస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


వరద బాధితులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీ కావ్య


వరదల్లో చిక్కుకున్న వారికి మంత్రి సురేఖ సమక్షంలో డ్రోన్ సహాయంతో నిత్యావసరాలను పంపిస్తున్న దృశ్యం


హంటర్‌రోడ్‌లో నీట మునిగిన వాహనం

వరద బీభత్సం.. వణికిన నగరం

చారిత్రక నగరిని అతలాకుతలం చేసిన మొంథా తుపాను


వరద ముంపు బాధితురాలిని ఓదార్చుతున్న మంత్రి కొండా సురేఖ

- పలు కాలనీలను, లోతట్టు ప్రాంతాలను చుట్టుముట్టిన వరద నీరు
- జల దిగ్బంధంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకురాని పరిస్థితి
- సహాయక చర్యలు చేపట్టిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం
- బోట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- మంత్రి సురేఖ, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్ల విస్తృత పర్యటనలు
- వరద పీడిత ప్రాంతాల్లో సమస్యల పరిశీలన
- ప్రధాన రహదారులపై స్తంభించిన వాహనాల రాకపోకలు
- లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు రావడంతో తీవ్ర నష్టం
- భారీ వర్షాలకు దెబ్బతిన్న అనేక రోడ్లు
- వరదనీటిలో మునిగి ఒకరు మృతి
- తీవ్రంగా దెబ్బతిన్న పంటలు.. అన్నదాతల కన్నీరుమున్నీరు

హనుమకొండ, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన అతి భారీవర్షాల వల్ల అతలాకుతలమైన వరంగల్, హనుమకొండ జిల్లా లు క్రమంగా కోలుకుంటున్నాయి. గురువారం తెల్లవారుజాము నుంచి వర్షాలు పడడం ఆగిపోవడంతో పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున నిలిచిన వరద నీరు క్రమంగా తగ్గుముఖం పడుతోంది. అయినా ఇంకా అనేక ప్రాంతాలు ఇప్పటికీ వరదనీటి దిగ్బంధంలోనే చిక్కుకొని ఉన్నాయి. ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో ప్రజలు ఇంకా బయటకు రాలేకపోతున్నారు. సహాయక కేంద్రాలకు కొంత మంది తరలివెళ్లగా.. మిగతా వారు కాలనీల్లో తమ ఇళ్లు, డాబాలపైకప్పులపైనే నిరీక్షిస్తూ గడపడం కనిపించింది. బుధవారం ఉదయం నుంచి వారంతా తినడానికి తిండి, తాగడానికి మంచినీళ్లు లేక నానా ఇబ్బందులు పడ్డారు. రాత్రంతా భయం భయంగా గడిపారు. మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీష్, మేయర్ గుండు సుధారాణి, నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఉదయం వరద పీడిత ప్రాంతాల్లో విస్తృతంతా పర్యటించారు. వరద బీభత్సాన్ని కళ్లారా చూశారు. వరద బాధితులతో మాట్లాడారు. వారికి అందుతున్న సహా యం గురించి అడిగి తెలుసుకున్నారు. పాలప్యాకెట్లు,

(మిగతా 6లో..)


కేయూ బైపాస్ రోడ్‌లోని సమ్మయ్య నగర్ వద్ద పోటెత్తుతున్న వరద


నగరంలో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్


ఖమ్మం బైపాస్ జంక్షన్ జలమయం

ఇరిగేషన్ అధికారుల నిద్రమత్తు

- వారి నిర్లక్ష్యంతో నీట మునిగిన 50కి పైగా కాలనీలు
- గోపాలపురం-సమ్మయ్యనగర్ వద్ద టన్నెల్ గేట్ ఎత్తక పోవడంతో వరద బీభత్సం
- గోపాలపురం చెరువుకు గండిపడటంతో తీవ్ర నష్టం
- ఇళ్లల్లోకి చొచ్చుకువచ్చిన వరదనీరు
- నీటిపాలైన వస్తువులు.. జనం నానా ఇబ్బందులు

6

నేడు సీఎం రాక

- నీట మునిగిన నగరంలో ఏరియల్ సర్వే
- పలు ప్రాంతాలను సందర్శించనున్న సీఎం
- కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో సమీక్ష



వరంగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొంథా తుఫాన్‌తో జలమయమైన వరంగల్ నగరాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించనున్నారు. తుఫాన్‌తో వరంగల్ నగరంలోని అనేక కాలనీలు నీటమునగగా రోడ్లు, పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలో గురువారం జిల్లా అధికారులు మంత్రి కొండా సురేఖతో కలిసి వర్షాల కారణంగా జరిగిన నష్టాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూనే శుక్రవారం వరంగల్ నగరాన్ని సందర్శించనున్నట్లు సీఎం పేర్కొన్నారు. తొలుత వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని పలు ప్రాంతాలను ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. అనంతరం హనుమకొండ, వరంగల్ పట్టణాల్లోని నీట మునిగిన పలు కాలనీలను సీఎం సందర్శించి బాధితులతో మాట్లాడనున్నారు. లోతట్టు ప్రాంతాల్లో బాధితులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను సీఎం పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షించనున్నారు. నగరంలో వరదలకు, లోతట్టు ప్రాంతాలు నీటమునగడానికి గల కారణాలపై సమీక్షించనున్నారు. భవిష్యత్‌లో వరంగల్ నగరానికి వరద ముప్పు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులతో చర్చించనున్నారు. ఇప్పటికే నగరంలో రూ.5170కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులకు సంబంధించిన పురోగతిపై సీఎం చర్చించనున్నారు. కాగా, సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

వరంగల్-హనుమకొండ మధ్య రాకపోకలకు బ్రేక్

మట్టెవాడ(వరంగల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో వరద పోటెత్తడంతో వరంగల్-హనుమకొండ పట్టణాల మధ్య రాకపోకలకు బ్రేక్ పడింది. ఈ పరిస్థితి బుధవారంతో పాటు గురువారం కూడా కొనసాగింది. ప్రధానంగా అలంకార్ జంక్షన్, ములుగురోడ్ జంక్షన్ వద్ద, అలాగే హంటర్‌రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు రాకపోకలను బంద్ చేశారు. దీంతో వాహనాలు అందుబాటులో లేక జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనులున్న వారు నానా వెతలకు గురయ్యారు. ప్రత్యామ్నాయ దారుల గుండా రాకపోకలకు ప్రయత్నించారు. హంటర్‌రోడ్‌లో బొందివాగు పొంగి ప్రవహించడంతో వరద ఉధృతి పెరిగి రామన్నపేట, పోతననగర్, హంటర్ రోడ్‌లోని సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీలను నీరు ముంచెత్తింది.


హనుమకొండలోని అలంకార్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు


హనుమకొండ 100 ఫీట్ల రోడ్డులో వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

రికార్డు స్థాయిలో వర్షపాతం

హనుమకొండ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో వందేళ్ల చరిత్రలో మరోసారి భారీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం మొత్తం 225.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఇది హనుమకొండలో ఇప్పటివరకు నమోదైన రెండో అత్యధిక వర్షపాతంగా రికార్డుల్లో నిలిచిందని వాతావరణ నిపుణులు తెలిపారు. అయితే అక్టోబర్ నెలలో నమోదైన వర్షపాతాలను పరిశీలిస్తే.. గత వందేళ్లలో ఇదే అత్యధికమని వారు తెలిపారు. 1903 జూలై 13న 227.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు ఇదే అత్యధికం. అయితే అక్టోబరును తీసుకుంటే.. 1995 అక్టోబరు 18న 146 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా దంచికొట్టిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. రహదారులను వరద ముంచెత్తడంతో జనజీవనం అతలాకుతలమైంది.

వరదలోనే అలంకార్ జంక్షన్

- జలదిగ్బంధంలో కాపువాడ, రాయపుర, కాకతీయ కాలనీలు
- బారికేడ్లు ఏర్పాటు.. రాకపోకలకు అంతరాయం
- లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని



అలంకార్ జంక్షన్ వద్ద వరదను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కుండపోతగా కురిసిన వర్షంతో హనుమకొండ అలంకార్ జంక్షన్ వరదనీటితో మునిగిపోయింది. వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ అలంకార్ జంక్షన్‌లోని ప్రధాన రోడ్డుపై వరద బీభత్సం తగ్గలేదు. హనుమకొండ చౌరస్తా నుంచి ములుగురోడ్డు, వరంగల్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో పోలీసులు ఏనుగులగడ్డ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో వాహనదారులు ఏనుగులగడ్డ నుంచి సుధానగర్, గుడిబండల్ మీదుగా కేయూ రోడ్డు గుండా ప్రయాణాలకు కొనసాగించారు.

ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

వరద నీటిలో ఉన్న అలంకార్ జంక్షన్‌ను గురువారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సందర్శించారు. వరదనీటి తీవ్రతపై సంబంధిత అధికారులతో చర్చించారు. వరద బాధితులకు, ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకోవాలని అదేశాలు జారీ చేశారు. అదే విధంగా వరదతో నీట మునిగిన కాపువాడ, రాయపురా, కాకతీయకాలనీలను స్వయంగా ట్రాక్టర్‌పై వెళ్లి సందర్శించారు. బాధితులతో మాట్లాడి వారికి ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో వరద పరిస్థితిపై సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. గడిచిన 24గంటల నుంచి జిల్లా అధికార యంత్రాంగం విశేషంగా కృషి చేస్తోందన్నారు. వరద సహాయక కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఊహకందని రీతిలో గతంలో ఎన్నడూలేని విధంగా భారీ స్థాయిలో వర్షాలు కురవడంతో వరద ఉధృతి పెరిగి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతాల నుంచి నగరంలోని లోతట్టు ప్రాంతాలకు పెద్దఎత్తున నీరు పోటెత్తిందన్నారు. వరద బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం వరద బాధిత కుటుంబాలకు పాలప్యాకెట్లు, తాగునీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్, ఎస్డీఆర్‌ఎఫ్, జీడబ్ల్యూఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు శోభనబోయిన కుమార్‌యాదవ్, మాడిశెట్టి సతీష్, మాడిశెట్టి రాజు, అఖిల్, అహ్మద్, షేక్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారుల నిద్రమత్తు

వారి నిర్లక్ష్యంతో నీట మునిగిన 50కి పైగా కాలనీలు

హనుమకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అధికారులు అప్రమత్తంగా ఉండకపోతే ఎంత నష్టం జరుగుతుందో బుధవారం నాటి భారీ, అతిభారీ వర్షాలు కలిగించిన బీభత్సమే ఉదాహరణ. మొంథా తుఫాను ప్రభావం హనుమకొండ, వరంగల్ జిల్లాలోపై కూడా తీవ్రంగా ఉండగలదని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ ఆ మేరకు తగిన జాగ్రత్తలు ముందస్తుగా తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐబీ , రెవెన్యూ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయ లోపం నగర ప్రజలకు శాపంగా మారింది. వరదల్లో చిక్కుకొని విలవిలలాడాల్సిన దుస్థితి ఏర్పడింది.

నాలుగేళ్ల క్రితం తుఫాను కారణంగా కుండపోతగా కురిసిన వర్షాల వల్ల నగరం పూర్తిగా నీటమునిగింది. 150కిపైగా కాలనీలు ముంపునకు గురయ్యాయి. కాలనీలన్నీ చెరువులుగా మారిపోయాయి. ప్రధానంగా గోపాలపురం చెరువు దిగువన ఉన్న కాలనీలు వరద బీభత్సానికి గురయ్యాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు గోపాల్ చెరువు దిగువన కేయూ వంద ఫీట్ల రోడ్డుపై కొత్త వంతెనను నిర్మించారు. నయీంనగర్ బ్రిడ్జిని సైతం కొత్తగా నిర్మించారు. నాలాలను వెడల్పు చేశారు. ప్రధానంగా గోపాలపురం నిండినప్పుడు వరద వెల్లువ నగరంలోని కాలనీలను ముంచెత్తకుండా నీటిని మళ్లించడానికి గోపాలపురం, సమ్మయ్య నగర్ మధ్య ఒక గేట్‌వాల్వ్‌ను ఐబీ అధికారులు ఏర్పాటు చేశారు. రూ. కోట్లు ఖర్చు పెట్టి ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినా విపత్తు సంభవించిన సమయంలో తీరా దీనిని వినియోగించడం అధికారులు మరిచిపోయారు. ఫలితంగా బుధవారం కురిసిన భారీ వర్షాల వల్ల ఉత్పన్నపమైన వరదలు నగరాన్ని మరో సారి ముంచెత్తాయి. ఐబీ అధికారులు సకాలంలో స్పందించి ఈ టన్నెల్ గేటును ఎత్తివేయాల్సి ఉండింది. కానీ ఈ విషయాన్నివారు మరిచిపోయారని తెలుస్తోంది.

భారీ వర్షాలు కురిసినప్పుడు మడికొండ చెరువు నిండి ఆ వరద నీరు సోమిడి చెరువు, అక్కడి నుంచి వడ్డెపల్లి చెరువులోకి, దీని నుంచి గోపాలపురం చెరువులోకి ప్రవహిస్తుంది. చెరువు పూర్తిగా నిండిపోతుంది. ఇప్పుడు కూడా అదే జరిగింది. వరదనీరు బయటకు పంపడానికి ఏర్పాటు చేసిన గేట్లు నీటిపారుదల శాఖ అధికారులు ఎత్తడం మరిచిపోయారు. దీంతో గోపాలపురం చెరువుకు మూడు చోట్ల గండ్లుపడి ఆ నీరంతా దిగువన ఉన్న సమ్మయ్య నగర్, జవహర్ నగర్, ద్వారాకా సాయి నగర్, టీవీ టవర్ కాలనీ, శ్రీక్రిష్ణ కాలనీ, ఆశోక కాలనీ, సదాశివ నగర్, గోకుల్ నగర్, రాజాజీ కాలనీ, పరిమిళ కాలనీలోని కొంత ప్రాంతంతో సహా 50కిపైగా కాలనీలు నీటమునిగాయి. ఇళ్లలోకి పెద్ద ఎత్తున వరద నీరు చొచ్చుకు వచ్చింది. ఇంట్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర విలువైన వస్తువులు తడిసిపోయి దెబ్బతిన్నాయి. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. జరగాల్సిన నష్టం అంతా జరిగిన తర్వాత ఐబీ అధికారులు అప్పుడు కళ్లు తెరిచి గురువారం మధ్యాహ్నానికి గోపాలపురం చెరువు గేట్లను ఎత్తినట్లు తెలుస్తోంది. నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ మధ్య కొరవడిన సమన్వయం, ముఖ్యంగా ఐబీ అధికారుల నిర్లక్ష్యం వెరసి నగర ప్రజలను కడగండ్ల పాలు చేసింది.

నగర డ్రైనేజీ వ్యవస్థపై ఇప్పటికీ సమగ్రమైన బ్లూప్రింట్ లేకపోవడంతో కొత్తగా వచ్చిన అధికారులకు తెలియక విపత్తులు సంభవించినప్పుడు సకాలంలో సత్వరం, సమర్థవంతమైన చర్యలు తీసుకోలేకపోతున్నారు. నగరంలోరాష్ట్ర ప్రభుత్వం రూ .640 కోట్ల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ఆమోద ముద్ర వేసినప్పటికీ ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. పనులు అసలే మొదలు కాలేదు. కాగితాలకే పరిమితమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణమే నగరంలో వరదల శాశ్వత పరిష్కారమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలి

- నగర మేయర్ గుండు సుధారాణి
- ముంపు ప్రాతాల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు జీడబ్ల్యూఎంసీ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. శుక్రవారం వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలను కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సందర్శించారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో నీట మునిగిన ప్రదేశాలను సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. వారికి భరోసానిచ్చారు. ఎన్ఎన్‌నగర్, నయీంనగర్ బ్రిడ్జి, జవహర్‌కాలనీ, దేవరాజ్‌కాలనీ, అంకార్ జంక్షన్, పెద్దమ్మగడ్డ, హనుమకొండ 100 ఫీట్ల రోడ్డు ప్రాంతాలతో పాటు వరంగల్‌లోని రామన్నపేట, పిన్నవారిస్ట్రీట్, పోతననగర్ ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి ప్రజలకు కావలసిన ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షాలకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌తో పాటు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

229.6 మి.మీ. వర్షపాతం నమోదు

కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో ఈనెల 29వ తేదీన ఉదయం 8:30గంటల నుంచి 30వ తేదీ (గురువారం)ఉదయం 8:30గంటల వరకు 229.6 మి.మీ. వర్షపాతం నమోదైందని కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. భీమదేవరపల్లి మండలంలో 390.6 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, వేలేరు మండలంలో 313.8 మి.మీ., కాజీపేట మండలంలో 313,6 మి.మీ., ధర్మసాగర్ మండలంలో 312.8 మి.మీ., హనుమకొండ మండంలో 310.8 మి.మీ., ఎల్కతుర్తి మండలంలో 295.4 మి.మీ., హసన్‌పర్తి మండలంలో 252.4 మి.మీ., ఐనవోలు మండలంలో 208.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

గోకుల్‌నగర్, ఇందిరమ్మ కాలనీ, పోచమ్మకుంట, హనుమకొండ చౌరస్తా, ఎన్జీవోస్‌కాలనీ రోడ్, భగత్ సింగ్ కాలనీ, పోస్టల్‌కాలనీ, జవహర్‌కాలనీ, భీమారం మెయిన్‌రోడ్, కాపువాడ, వివేక్‌నగర్, అమరావతినగర్, సమ్మయ్యనగర్, ప్రగతినగర్, తిరుమల బార్ ఏరియా పరిధి నీటి ప్రవాహానికి గురైనట్లు కలెక్టర్ తెలిపారు. నగరంలో ముంపు ప్రభావంలో ఉన్న కాలనీల నుంచి 896 మందిని 12 పునరావాస కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో కాజీపేట ప్రగతినగర్‌లోని వెంకటేశ్వర బధిరుల పాఠశాలకు చెందిన 156 మంది విద్యార్థులను మడికొండలోని రెసిడెన్షియల్ బాలికలు, బాలుర పాఠశాలల్లో చేర్పించామన్నారు. గుండ్లసింగారంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్లఓ 100 మందిని, వనమాల కనపర్తి గ్రామపంచాయతీలో 5గురికి, ప్రగతినగర్ ఐడియల్ స్కూల్‌లో 60 మందికి, బంధం చెరువు దగ్గర ఉన్న భవిష్య నిధి కార్యాలయంలో 60 మందికి, సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు చెందిన 470 మంది విద్యార్థులకు హసన్‌పర్తిలోని రెండు కేంద్రాలు, మడికొండలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలకు తరలించారు.అదేవిధంగా తిరుమలకాలనీకి చెందిన 17 మందిని, టీఎన్‌జీఓస్‌కాలనీకి చెందిన 18 మందిని, కాపువాడకు చెందిన 10 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో ఆర్అండ్‌బీ పరిధిలో 12రోడ్లు, పంచాయతీరాజ్‌కు సంబంధించిన 21 రోడ్లు దెబ్బతిన్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వరి పంట 33,348 ఎకరాలు, పత్తి 750 ఎకరాలు, మొక్కజొన్న 620 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు.

విద్యుత్ పనులు

యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

నర్సంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేల కూలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు దెబ్బతినడం వల్ల ఏర్పడ్డ విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని నివారించేందుకు విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని విద్యుత్ అధికారులను ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. నర్సంపేటలో తుఫాన్ వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వేలాడిన వైర్ల పునరుద్ధరణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫీడర్లు, సబ్‌స్టేషన్ల స్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు శ్రమించాలని సూచించారు. విద్యుత్ సమస్య ఉంటే 1912 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

పిడుగు పాటుతో విద్యుత్ శాఖకు భారీ నష్టం

నెక్కొండ(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా విద్యుత్ శాఖకు రూ.50 లక్షల వరకు నష్టం జరిగిందని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. నెక్కొండలోని 133/33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన గురువారం రాత్రి సందర్శించారు. ఈనెల 29న మండలంలోని పత్తిపాక సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతంలో రెండు పిడుగులు పడటంతో విద్యుత్ సరఫరా చేయాల్సిన ఆరు బ్రేకర్లు దెబ్బతిన్నట్లు చెప్పారు. దీంతో నెక్కొండ 133/33/11కేవీ నుంచి నాగారం, లింగగిరి, రెడ్లవాడ, పత్తిపాకలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లకు సరఫరా చేయడంలో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఈ బ్రేకర్ల విలువ రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటుందన్నారు. వారం రోజుల్లో నూతన బ్రేకర్లు అమర్చుస్తామన్నారు. అంతవరకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఎన్పీడీఎల్ డైరెక్టర్ మధుసూదన్, నర్సంపేట డీఈ తిరుపతి, ఏడీఈ శ్రీధర్, ఏఈ చిరంజీవి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు తక్షణ సహాయం అందించాలి

- అధికారులకు కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం
- వరద ప్రభావ ప్రాంతాల పరిశీలన

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు తక్షణ సహాయ చర్యలు అందించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండలోని పలు లోతట్టు ప్రాంతాలను అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సహాయక చర్యల గురించి విధుల్లో ఉన్న అధికారులను అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, పోలీస్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ డీఆర్ఎఫ్ బృందాలు అందిస్తున్న సహాయక చర్యలను పరిశీలించారు. గోపాల్‌పూర్ ఊర చెరువుతోపాటు హనుమకొండలోని ప్రగతినగర్, వివేక్‌నగర్, అమరావతి నగర్, 100 ఫీట్లరోడ్‌లోని సమ్మయ్యనగర్ ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు.

అనంతరం హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రి సమీపంలో నివసిస్తున్న ఒక కుటుంబం వరదలో చిక్కుకోగా డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో బోటులో ఆ కుటుంబాన్ని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. హనుమకొండలోని అలంకార్ జంక్షన్, కాపువాడలో వరద ముంపునకు గురైన కాలనీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముంపునకు గురైన కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

గురుకుల విద్యార్థుల తరలింపు

హంటర్‌రోడ్‌లోని సీఎస్ఆర్‌గార్డెన్ సమీపంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలోకి వరదనీరు చేరడంతో అందులో ఉన్న 470 మంది విద్యార్థినులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చి హసన్‌పర్తి, సుబ్బయ్యపల్లి, మడికొండలోని బాలికల కళాశాలకు తరలించారు. నీటమునిగిన గురుకుల పాఠశాలలోకి బోటు సహాయంతో కలెక్టర్ వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు.

విధుల నుంచి అంగన్‌వాడీ టీచర్ తొలగింపు

ఖానాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఓ తండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్‌ను విధుల్లో నుంచి తొలగించినట్లు జిల్లా సంక్షేమాధికారి రాజమణి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరు అంగన్‌వాడీ టీచర్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా కుమారుడిని(16 ఏళ్లు) అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకు వచ్చింది. అతడు ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ సత్యశారద అంగన్‌వాడీ టీచర్‌పై విచారణకు ఆదేశించారు. దీంతో వరంగల్ ఆర్‌జేడీ ఝాన్సీ, జాయింట్ డైరెక్టర్ మోతీతో కలిసి విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం సదరు అంగన్‌వాడీ టీచర్‌ను విధుల్లో నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

సజావుగా రైళ్ల రాకపోకలు

గిర్మాజీపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరంగల్- విజయవాడ మార్గంలో నిలిచిపోయిన రైళ్ల రాకపోకలు బుధవారం అర్ధరాత్రి నుంచి తిరిగి మొదలయ్యాయి. డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై వరదనీరు పోటెత్తడంతో వరంగల్- విజయవాడ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయిన విషయం విధితమే. ఇందులో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో హౌరా ఈస్ట్‌కోస్ట్, సికింద్రాబాద్- గుంటూరు ఇంటర్‌సిటీ నిలిచిపోయాయి. రైల్వేశాఖ చేపట్టిన మరమ్మతుల చర్యలతో బుధవారం అర్ధరాత్రి నుంచి తిరిగి రైళ్ల రాకపోకలు పునరుద్ధరించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి సికింద్రాబాద్- విజయవాడ, విజయవాడ-సికింద్రాబాద్ మార్గంలో రైళ్లు కొద్దిగా ఆలస్యంగా నడిచాయి. అయితే గురువారం సికింద్రాబాద్-విజయవాడ-సికింద్రాబాద్ శాతవాహన రైలును మాత్రం రద్దు చేశారు.

కళాకారుల ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): యువజన క్రీడోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమకొండ జవహర్ లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యం గ్రూప్, జానపద పాటల గ్రూప్, వ్యాసచరచన (హిందీ, ఇంగ్లిష్, తెలుగు) పోటీలు, పెయింటింగ్, ఉపన్యాసం, (హిందీ, ఇంగ్లిష్) కవిత్వం (హిందీ, ఇంగ్లిష్, తెలుగు)లో, ఇనోవేషన్ ట్రాక్‌లో స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహించనున్నట్లు అశోక్‌కుమార్ వెల్లడించారు. ఇందులో పాల్గొనే కళాకారులు 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కళాకారులు 10 జనవరి నుంచి 12 జనవరి 2026 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి యువజన ఉత్సవాలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 31న హనుమకొండ జేఎన్ఎస్‌లోని డీఎస్ఏ కార్యాలయంలో రిపోర్టు చేయాలని అశోక్‌కుమార్ సూచించారు. మరిన్ని వివరాలకు 9392997668 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

వరద బీభత్సం.. వణికిన నగరం..

(5వ పేజీ తరువాయి)

వాటర్ బాటిళ్లు, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.

సహాయక చర్యలు

జలదిగ్బంధంలో చిక్కుపోయినవారిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గురువారం కూడా రక్షించి సురక్షిత ప్రాంతాలకు చేర్చాయి. బోట్ల సహాయంతో వారిని వరద నీటిని నుంచి బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రాలకు తరలించాయి. వరదనీరు ఇంకా పూర్తి స్థాయిలో తగ్గకపోవడంతో వరద బాధితులు గురువారం కూడా పునరావాస కేంద్రంలో కొనసాగారు. వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం ఏర్పాటు చేశారు. వరదనీటిని బయటకు పంపేందుకు కార్పొరేషన్ సిబ్బంది జేసీబీల సహాయంతో అడ్డంకులను తొలగిస్తున్నారు. కొన్నిచోట్ల గండ్లు పెట్టారు. వరద ప్రవాహానికి అడ్డంకిగా పేరుకుపోయిన చెత్తను తొలగించారు. హంటర్‌రోడ్డులోని జ్యోతిరావు పూలే డిగ్రీ కళాశాలలో వదరలో చిక్కుకున్న 473 మంది విద్యార్థినులను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సహాయంతో సురక్షిత ప్రాంతానికి తరలించారు. వారికి సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్ కుమార్ అల్పాహారం అందించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి కింద పెద్ద ఎత్తున నిలిచిపోయిన వరదనీటిని మోటార్ల సైతంతో బయటకు పంపించారు. హంటర్‌రోడ్డులో ఒక కుటుంబం వరదనీటిలో చిక్కుకున్నదని తెలిసి బోటు సహాయంతో కాపాడారు.



అమరావతి నగర్ వద్ద రోడ్డుపై పారుతున్న వరద

హనుమకొండ, గోపాలపురం, టీఎన్‌జీవోస్ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లోనూ పర్యటించారు. గోపాలపురం ప్రాంతంలో వరద ఉధృతి తీవ్రతను గమనించిన ఎంపీ.. వెంటనే నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం టీఎన్‌జీవోస్ కాలనీలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి బోటులో ప్రయాణిస్తూ మొత్తం ప్రాంతాన్ని పరిశీలించారు. జల దిగ్బంధంలో ఉన్న ఇళ్ల వద్దకు స్వయంగా చేరుకొని ప్రజలకు ధైర్యం చెప్పారు. అలాగే వరంగల్‌లో కూడా ఎంపీ కావ్య పర్యటించారు. అక్కడ డ్రోన్ల ద్వారా ఆహారం, తాగునీరు పంపిణీ చేయడాన్ని మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ కూడా క్షేత్రస్థాయిలో పలు వరదపీడిత ప్రాంతాలలో పర్యటించారు. గోపాల్‌పూర్ ఊర చెరువుతో పాటు ప్రగతి నగర్, వివేక్ నగర్, అమరావతి నగర్, కేయూ 100 ఫీట్ల రోడ్డు, సమ్మయ్యనగర్ ప్రాంతాలను సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అక్కడి నుంచి హంటర్‌రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక కుటుంబం వరదలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమాచారం రావడంతో ఆ ప్రదేశానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని సహాయకచర్యల్లో పాల్గొంటున్న డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో బోటులో బయటకు తీసుకువచ్చారు.

పునరావాస కేంద్రానికి తరలించారు. హనుమకొండలోని అలంకార్ జంక్షన్‌తోపాటు కాపువాడలో వరద ముంపునకు గురైన కాలనీలను కలెక్టర్ పరిశీలించారు. హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్‌రెడ్డి, బావు సింగ్, సూపరింటెండెంట్ జగత్‌సింగ్, కిరణ్‌కుమార్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్యాంకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆస్తి నష్టం

ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామ శివారులోని చెరువు పొంగడంతో రెండు ఆవులు, ఒక గేదె వరదనీటిలో కొట్టుకుపోయింది. తెప్పల సహాయంతో మృతి చెందిన వీటిని బయటకు తీసుకువచ్చారు. ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామంలోని మర్రిచెట్టు దర్గా వద్ద రిజర్వాయర్ గేట్లు ఎత్తి వేయడంతో బ్రిడ్జి పైనుంచి గ్రామంలోకి వరద నీరు ప్రవేశిస్తోంది. వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలవల్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. పలుచోట్ల కల్వర్టులు తెగిపోయాయి. వరంగల్‌లో పోతననగర్ రోడ్డు, అండర్ బ్రిడ్జి రోడ్డు, దేశాయిపేట రోడ్డు బాగా దెబ్బతిన్నది. దేశాయిపేట నుంచి బ్యాంక్ కాలనీ వెళ్లే మార్గంలో జంక్షన్ వద్ద పైపులైన్లు కుంగిపోయి ఈ రోడ్డు ధ్వంసమైంది. హనుమకొండలోని గోపాల్‌పూర్ చెరువు తెగిపోవడంతో వరదనీరంతా పరిమిళకాలనీలోని కాలువమీదుగా ఉధృతంగా ప్రవహించింది.

ములుగు రోడ్డు, హంటర్ రోడ్డు, కేయూ 100 ఫీట్ల రోడ్డుపై భారీగా వరదనీరు ఇంకా నిలిచి ఉండడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ మార్గాల్లో ట్రాఫిక్‌లో చిక్కుకొని వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నడికూడ మండలం కంఠాత్మకూరు వాగు ప్రవాహ ఉధృతి ఇంకా తగ్గలేదు. వాహనాలను ఇతర మార్గాల గుండా మళ్లిస్తున్నారు. దామెర ఎస్ఐ ఆశోక్ వరద ప్రవాహాన్ని పరిశీలించి తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు. నడికూడ వాగు పొంగిపొర్లుతున్నది. ఐనవోలు మండలంలో అన్ని చెరువులు అలుగు పోస్తున్నాయి.

మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ కలెక్టర్ సత్యశారద, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, సీపీ సన్ ప్రీత్ సింగ్ గురువారం వరద పీడిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బాధితులను పరామర్శించారు. మంత్రి సురేఖ, వరంగల్ కలెక్టర్ డాక్టర్‌తో కలిసి వరంగల్ పరిధిలోని ఎస్ఎన్ నగర్, బీఆర్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను పరామర్శించారు. వారికి సహాయం అందుతున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎమ్మార్వో ఇక్బాల్‌తో పాటు కార్పొరేటర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కాగా, ఎంపీ డాక్టర్ కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండలోని అలంకార్ జంక్షన్, కాపువాడ ప్రాంతాల్లో వరద ప్రభావాన్ని స్వయంగా పరిశీలించారు. ఎంపీ కావ్య ట్రాక్టర్‌లో వెళ్లి నీట మునిగిన ప్రాంతాలను సందర్శించి, బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు పాల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.

పంటలకు అపార నష్టం

భారీ వర్షాల వల్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లోకి వరదనీరు ప్రవహించడంతో వందల ఎకరాల్లో వరిపైర్లు వాలిపోయాయి. వరి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పొలాల్లో వరదనీరు ఇంకా నిలిచి ఉండడంతో వ్యవసాయ విస్తరణాధికారులు ఒకటీ రెండు రోజుల్లో పంట నష్టాన్ని అంచనా వేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటికే ఆదేశాలు అందాయని తెలిపారు.

జల దిగ్బంధంలోనే కాలనీలు

వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాల్లోని పలు కాలనీలు ఇంకా జలదిగ్బంధంలోనే చిక్కుకొని ఉన్నాయి. ఇళ్ల చుట్టూ పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోయి ఉంది. వరంగల్‌లో ఎస్ఆర్ నగర్, సాయినగర్, మధరా నగర్, వీవర్స్ కాలనీ, ఎంహెచ్‌నగర్ తదితర కాలనీల్లో గురవారం సాయంత్రం వరకు కూడా మోకాలు ఎత్తు వరకు వరదనీరు నిలిచి ఉంది. ములుగు రోడ్డులోని నాలా ఉధృతంగా ప్రవహిస్తోంది. సంతోషిమాత కాలనీ, డీకే నగర్, ఎన్ఎన్ నగర్, మైసయ్యనగర్, సమ్మయ్యనగర్, సాయినగర్ కాలనీల్లోని ఇళ్లన్నీ ఇప్పటికీ నీళ్లలోనే ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హనుమకొండలోని ఇందిరానగర్‌లో వరద తగ్గుముఖం పట్టలేదు. ఇళ్లచుట్టూ నీరు అలాగే నిలిచి ఉండడంతో స్థానికులు ఇళ్లకే పరిమితం కావలసి వస్తోంది. పాలు, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి కూడా బయటకు రాలేని పరిస్థితి ఉంది. ఈ ప్రాంతంలో 500కు పైగా ఇళ్లు ఉన్నాయి. వీరంతా ఇంకా భయం గుప్పిట్లోనే బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు.

వరదనీళ్లలో ఓరుగల్లు



జలమయమైన హంటర్‌రోడ్‌లోని భద్రకాళి బండ్ జంక్షన్

చిన్నారులను తరలిస్తున్న రెస్క్యూ సిబ్బంది

గోపాల్‌పూర్ చెరువు వరద నీరు ముంచెత్తడంతో జవహర్ కాలనీలో వరదనీటి మధ్యలో ఇళ్లు

జవహర్‌కాలనీలో నీటిలో మునిగిన కారు

పెద్దమ్మగడ్డ నాలా వద్ద వరదనీరు ప్రవహిస్తుండడంతో భారీగా పేరుకుపోయిన వాహనాలు

భారీ వర్షానికి వరంగల్ నగరంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న నాలా, వరదనీటిలో మునిగిపోయిన పలు కాలనీలు

మృత్యు వరద

మొంథా తుఫాన్‌తో ఉమ్మడి జిల్లాలో ఆరుగురి మృతి

మొంథా తుఫాన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ప్రభావం చూపింది. వర్షానికి పలు ప్రాంతాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు.

వరదనీటిలో చిక్కుకుని వృద్ధుడి మృతి



ఆడెపు క్రిష్ణమూర్తి

వరంగల్‌సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో 14వ డివిజన్ ఎస్‌ఆర్‌నగర్‌లో ఆడెపు క్రిష్ణమూర్తి(70) అనే వృద్ధుడు కాలికి గాయమవడంతో వరదనీటి నుంచి బయటకు రాలేకపోయి తాను ఉంటున్న ఇంటిలోనే మృతి చెందాడు. మృతుడి భార్య కొవిడ్ సమయంలో మృతి చెందిం ది. అతడికి పిల్లలు లేరు. ఒక్కడే నివాసముంటున్నాడు. కాగా గురువారం ఉదయం స్థానిక నాయకుడు కేతిరి రాజశేఖర్ చూసి పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

చావుకు వెళ్లి వస్తూ.. వరద నీటిలో గల్లంతు ..



పులి అనిల్(ఫైల్)

ఖిలావరంగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బంధువు దహన సంస్కారాలకు వెళ్లి వస్తున్న క్రమంలో నగరంలోని మైసయ్యనగర్ వద్ద వరదలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. మిల్స్‌కాలనీ పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ మండలం గుట్టకిందిపల్లి ప్రాంతానికి పులి అనిల్‌కుమార్ (30)బుధవారం రాత్రి తన భార్య మమతతో కలిసి శాకరాసికుంటలో తమ బంధువు దహన సంస్కారాలకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా భారీగా వర్షం కురవడంతో ఖమ్మం రోడ్డు వద్ద తన భార్యను బస్సులో ఎక్కించాడు. ఆయన అదే రోడ్డు గుండా మైసయ్యనగర్ ద్వారా గీసుగొండకు వెళ్తున్న క్రమంలో దారి కనిపించక నీళ్లలో పడి గల్లంతయ్యాడు. మృతుడి భార్య మిల్స్‌కాలనీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెతుకుతున్న క్రమంలో శివనగర్‌లోని పెద్ద మోరీలో మృతుడి శవం కనిపించింది. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మిల్స్‌కాలనీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు కూలి వృద్ధురాలి మృతి



మృతిచెందిన వృద్ధురాలు సూరమ్మ

ఐనవోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇళ్లు కూలి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తిలో గురువారం చోటుచేసుకుంది. అదనపు గిర్దావర్ మల్లయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపర్తి గ్రామానికి చెందిన వృద్ధురాలు గద్దల సూరమ్మ (60) భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. పెంకుటింట్లో ఒంటరిగా పడుకొని ఉండగా గురువారం తెల్లవారుజామున ఇల్లు గోడ కూలి అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థులు మట్టిలో కూరుకపోయిన సూరమ్మను బయటికి తీశారు. ప్రాణ నష్టంతోపాటు ఆస్తి నష్టం రూ.1.25 లక్షలు జరిగినట్లు అంచనా వేశారు.

మొట్లతండాలో రైతు గల్లంతు



సంపత్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి శివారు మొట్లతండా వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగులో రెడ్యాల గ్రామానికి చెందిన పులిగుజ్జు సంపత్ (30) బుధవారం రాత్రి గల్లంతయ్యాడు. ఎన్డీఆర్ఎఫ్, మానుకోట రూరల్ పోలీసులు, గ్రామస్థులు కలిసి వెతకగా మొట్లతండా సమీపంలో గురువారం పొలాల్లో రైతు మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు, రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం రెడ్యాలకు చెందిన పులిగుజ్జు సంపత్ బుధవారం గురిమిళ్ల నుంచి రెడ్యాలకు వస్తున్నాడు. ఈ క్రమంలో కంబాలపల్లి-మొట్లతండా మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్న వాగులో పడి పోయాడు. ఎంతకు ఇంటికి రాకపోవడంతో సంపత్ కుటుంబ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాగులో ఒకరు కొట్టుకుపోయారని కంబాలపల్లికి చెందిన ఓ రైతు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గురువారం ఉదయం వారు ఎన్డీఆర్ఎఫ్ బృందంతో కలసి వాగు సమీపంలో వెతికారు. దగ్గరలోని పంట పొలాల్లో సంపత్ మృతదేహం లభ్యమైంది. సంపత్ భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి మృతి



రిటైర్డు ఉద్యోగి శ్రీనివాస్ (ఫైల్)

హనుమకొండ టౌన్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): హనుమకొండ టీవీ టవర్‌కాలనీకి చెందిన పాక శ్రీనివాస్(63) ఇంటి ముందు వరదలో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం 10గంటలకు భార్య శ్రీదేవి, కొడుకు శ్రీకాంత్ ఇంట్లో ఉండగా, వరద ప్రవాహం ఇంటిగేటు వద్ద చూస్తుండగా వరదలో పడి మునిగి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు మృతదేహానికి శుక్రవారం పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరదలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి



అప్పని నాగేంద్రం (ఫైల్)

భీమదేవరపల్లి, (ఎల్కతుర్తి) అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భీమదేవపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అప్పని నాగేంద్రం (58) అనే వ్యక్తి కల్వర్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహంలో చిక్కుకుని మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగేంద్రం హనుమకొండలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో వర్షం మరింత పెరిగింది. దీంతో గ్రామంలోకి వెళ్లే కల్వర్టు పూర్తిగా జలమయమైంది. కల్వర్టు దాటే ప్రయత్నం చేశాడు. ఆయనకు నీటి ప్రవాహం సరిగా కనబడకపోయే సరికి కల్వర్టులో చిక్కుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, ఇద్దరుకుమారులు ఉన్నారు. అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

అన్నదాత.. గుండె కోత..

● మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటలకు తీరని నష్టం ● కన్నీరుమున్నీరవుతున్న రైతన్న

మొంథా తుఫాన్ అన్నదాతను నట్టేట ముంచింది. అకాల వర్షానికి పంటలన్నీ నేలపాలయ్యాయి. కోతకు దగ్గరపడ్డ వరి నీళ్లలో మునిగిపోయింది. పత్తి దూది తడిసిపోయింది. మొక్కజొన్న పంట ధ్వంసమైంది. ఒక్క రోజులో కురిసిన వర్షానికి రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ములుగులో..



ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి పంటను కట్టలు కట్టి నిలబెడుతున్న రైతు

ములుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ములుగు జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు సగటు వర్షపాతం 4.14 సెం.మీ నమోదైందని అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 ఎకరాల్లో వరి పంట నేల వాలినట్లు డీఏవోసురేష్ కుమార్ తెలిపారు. అత్యధికంగా గోవిందరావుపేట మండలం, మంగపేట మండలాల్లో వరి పంట నేటకొరిగిందన్నారు. భారీ వర్షం కురవకపోవడంతో పంట నష్టం పెద్ద మొత్తంలో లేదని, ఈదురుగాలులు వల్ల వరి వంగడాలు నేలకొరిగాయని అన్నారు. వాటిని కట్టలు కట్టి ఆరబెడితే ప్రయోజనం ఉంటుందని సూచించారు.



ములుగు జిల్లా వాజేడు మండలంలో నేలవాలిన వరి పంట

జనగామలో..

జనగామ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లావ్యాప్తంగా బుధవారం నాటి తుఫాన్ అన్నదాతకు నష్టాన్ని మిగిల్చింది. భారీ వర్షాలతో జిల్లాలో చాలా చోట్ల వరి, పత్తి పంటలు నీటిమునిగాయి. జిల్లాలో 25816 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో వరి 1,9131 ఎకరాల్లో, పత్తి 6416ఎకరాల్లో, మొక్కజొన్న 249 ఎకరాల్లో, టమాట, మిర్చి 20ఎకరాల్లో నష్టం జరిగింది. జిల్లావ్యాప్తంగా 142 గ్రామాల పరిధిలోని 9,888 మంది రైతులకు సంబంధించి రైతులు పంటలు నష్టపోయారని అధికారులు గుర్తించారు. చాలా ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి నేలకొరిగి గింజలన్నీ రాలిపోయాయి. మరోవైపు.. తీత దశకు వచ్చిన పత్తి రాలిపోయింది. చెట్టుపై ఉన్న పత్తి కూడా మొలకెత్తే ప్రమాదం ఉంది. కేంద్రాల్లో ధాన్యాన్ని పోసి టార్పాలిన్లు కప్పినప్పటికీ కుప్పల కింద నుంచి వర్షపు నీరు ప్రవహించి ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలతో పాటు వ్యవసాయ బావులు, రోడ్ల వెంట పోసుకున్న ధాన్యం సైతం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. గురువారం తెల్లవారుజామునే ధాన్యం కుప్పల వద్దకు రైతులు పరుగులు తీశారు. టార్పాలిన్లు తెచ్చి తడిసిన ధాన్యాన్ని, పొడి ధాన్యాన్ని వేరు చేశారు.



జనగామ మండలం వడ్లకొండ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

భూపాలపల్లిలో..



భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం వజినేపల్లిలో తడిసిపోయిన పత్తి పంట

భూపాలపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాల్లో పత్తి పంట తీవ్రంగా దెబ్బతినగా కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల, మల్హర్ మండలాల్లో పొట్ట దశలో ఉన్న వరి పంట ఈదురుగాలుల తాకిడికి నేలవాలింది. అయితే.. అధికారికంగా ఎక్కడా ఎలాంటి పంట నష్టం వాటిల్లలేదని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ కాటారం సబ్ డివిజన్ పరిధిలోని 500 ఎకరాలకు పైగా వరి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాటారం, మహదేవపూర్ మండలాల్లో భారీ వర్షానికి తోడు ఈదురుగాలులు వీచడంతో వరి పంట మొత్తం నేలమట్టమైంది. దీంతో ఆయా మండాల్లో రైతులు గురువారం వర్షం తెరిపినిచ్చిన తర్వాత వాటిని నిలబెట్టే ప్రయత్నాలు చేశారు. మరోవైపు చేతి కందే దశలో ఉన్న పత్తి, వర్షం దెబ్బతో పూర్తిగా తడిసిపోవడంతో రంగు మారిందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఎంత నష్టం వాటిల్లిందనేది అధికారులు సర్వే చేస్తే తప్ప తెలిసే అవకాశం లేదంటున్నారు.

మహబూబాబాద్‌లో..

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రైతులను తీవ్రంగా నష్ట పరిచింది. భారీ వర్షాలు జిల్లా రైతులను కన్నీటిపాలు చేసింది. చేతికొచ్చిన పంట వానపాలైంది. వరికోత దశలో ఏకధాటిగా కురిసిన వర్షాలతో భారీ నష్టాన్ని మిగిల్చింది. పత్తి పూత, కాత దశలో భారీ వర్షాలు పడి నష్టాన్ని మిగిల్చగా, ఉన్న కొద్దిపాటి పంటను కాపాడుకుందామనుకుంటే అతిభారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు భారీ మొత్తంలోనే నష్టపోవాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంటల నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం అంచనా వేసేందుకు కదిలారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 217 గ్రామాల్లో 15,614 మంది రైతులకు చెందిన 16,617 ఎకరాల్లో వరికి నష్టం జరిగింది. 8,782 ఎకరాల్లో పత్తి, 65 ఎకరాల్లో మొక్కజొన్న, 565 ఎకరాల్లో మిర్చివెరసి 26,029 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. 2408.1 మిల్లిమీటర్ల వర్షపాతం కురియగా, నగటున 150.5 మిల్లిమీటర్ల వర్షపాతం కురిసింది.



కేసముద్రం మండలం తౌర్యతండాలో రైతు చంద్రుకు చెందిన నేలవాలిన పత్తి చేలు

వాగులో కొట్టుకుపోయిన ప్రేమజంట



గల్లంతైన యువతి.. ప్రాణాలతో బయటపడిన యువకుడు

స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గడ్ వైపు వస్తుండగా ఘటన

యువతి కోసం రెస్క్యూ టీం గాలింపు



ప్రాణాలతో బయటపడిన యువకుడు శివకుమార్

జఫర్‌గడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కోనాయిచలం శివారు బోళ్ల మత్తడి వాగులో వరద ఉధృతికి ఓ ప్రేమజంట కొట్టుకుపోగా, ఇద్దరిలో బక్క శ్రావ్య (18) గల్లంతు కాగా, ఆమె వెంట ఉన్న బరిగెల శివకుమార్ యువకుడు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన బక్క ఆలిసాబ్ - పూర్ణ దంపతులు ముగ్గురు కుమార్తెలు. చిన్నకుమార్తెతో కలిసి 20 ఏళ్లుగా హైద్రాబాద్‌లోని ఓ ఫౌల్ట్రీఫాంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. రెండో కుమార్తె శ్రావ్య వరంగల్‌లోని ఉమెన్ హాస్టల్‌లో ఉంటూ ఖిలావరంగల్ పరిధిలోని బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. యువతి తల్లిదండ్రులు పనిచేస్తున్న ఫౌల్ట్రీ ఫాంలోనే పని చేస్తున్న రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లికి చెందిన బరిగెల శివకుమార్‌తో శ్రావ్య మధ్య పరిచయం పెరిగి ప్రేమగా మారింది. బుధవారం హైద్రాబాద్ నుంచి బైక్‌పై వచ్చిన శివకుమార్ శ్రావ్య ఉంటున్న హాస్టల్‌కు చేరుకున్నాడు. అక్కడినుంచి తన బైక్‌పై జఫర్‌గడ్ మండలం కోనాయిచలంలోని స్నేహితుడి ఇంటికి శ్రావ్యను తీసుకుని స్టేషన్‌ఘన్‌పూర్, తిమ్మంపేట మీదుగా వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి 10 గంటల ప్రాంతంలో జఫర్‌గడ్ మండలం బోళ్లమత్తడి వద్ద ప్రధాన బీటీ రోడ్డుపై నుంచి వాగు దాటే ప్రయత్నంలో శివకుమార్- శ్రావ్యలు వరద ఉధృతికి బైక్‌తో సహా వాగులో కొట్టుకుపోయారు. శ్రావ్య గల్లంతు కాగా, శివకుమార్ ఓచెట్టును పట్టుకుని ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. రాత్రి జఫర్‌గడ్ పోలీసుస్టేషన్‌లో ఘటనాసమాచారం తెలుపగా.. వెంటనే పోలీసులు వరంగల్ ఎస్‌ఆర్‌డీఎఫ్ రెస్క్యూటీం సిబ్బందిని ఘటనా స్థలికి రప్పించి గల్లంతైన శ్రావ్య కోసం వాగులో గాలింపు చేపట్టారు. ఘటనా స్థలికి జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ చేరుకుని గాలింపు చర్యలను పరిశీలించారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న నాయక్, సీఐ శ్రీనివాసరావు, జఫర్‌గడ్ ఎస్ఐ రామారావు ఘటనా స్థలి వద్ద గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, సాయంత్రం వరకు యువతి ఆచూకీ లభించలేదు.

మిన్నంటిన రోదనలు



రోదిస్తున్న యువతి కుటుంబీకులు

ఘటనా స్థలి వద్దకు గురువారం చేరుకున్న యువతి తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కూతురును తలుచుకుంటూ భోరున విలపిస్తుండడం స్థానికులను కంటతడిపెట్టించాయి. తాము జీవనోపాధి కోసం సుమారు 20 ఏళ్ల కిందట హైద్రాబాద్‌కు వెళ్లి ఫౌల్ట్రీ ఫామ్‌లో పని చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. తాము బంధువు అంత్యక్రియల కోసం బుధవారం ఖిలావరంగల్‌కు వచ్చామని, గురువారం ఉదయం కూతురు వాగులో గల్లంతైన విషయం తెలిసిందని తండ్రి అలీసాబ్ విలపిస్తూ చెప్పాడు. శ్రావ్య వరంగల్‌లోని హాస్టల్‌లో ఉంటూ బొల్లికుంట వద్ద గల వాగ్దేవి కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతోందని, అమ్మాయి హైద్రాబాద్‌కు వెళ్లిన విషయం తమకు తెలియదన్నారు.

ఖమ్మం రోడ్డులో నిలిచిన వరద నీరు





శివనగర్‌లో ఓ ఇంట్లో సెల్లార్‌లో చేరిన నీరు

జల దిగ్బంధంలో అండర్ రైల్వేగేట్

● ఇళ్లలోకి వర్షం నీరు.. లోతట్టు ప్రాంతవాసులకు ఇబ్బందులు ● ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు ● పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు



బాధితులను బోటుద్వారా తరలిస్తున్న ఏఎస్పీ శుభం ప్రకాశ్ తదితరులు



శివనగర్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు



అండర్‌బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీరు



పుప్పాలగుట్ట, ఖమ్మం రోడ్డు వద్ద నిలిచిన నీరు

ఖిలావరంగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అండర్ రైల్వేగేట్‌లోని అనేక ప్రాంతాలు నీటమునిగాయి. గురువారం వరంగల్ అండర్ రైల్వేగేట్‌లోని లోతట్టు, గుడిసె ప్రాంతాల ప్రజలు తాగునీరు, ఆహార పదార్థాల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫోన్లు చేసినా నగరపాలక సంస్థ, పోలీ స్, విద్యుత్ సంబంధిత అధికారులు పట్టించుకునే నాథుడు లేడని ప్రజ లు తీవ్రంగా మండిపడుతున్నారు. బుధవారం ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి ఖిలావరంగల్, శివనగర్, మైసయ్యనగర్, పాడి మల్లారెడ్డినగర్, భూపేష్‌నగర్, అండర్‌బ్రిడ్జి ఇసుక అడ్డా, ఖమ్మంరోడ్, చింతల్, పుప్పాల గుట్ట, క్రిస్టియన్ కాలనీ, లేబర్‌కాలనీ, అబ్బనికుంట, శాలినినగర్, గాంధీ నగర్, తదితర పాంతాల్లోకి ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఖిలావరంగల్ పడమర కోటలోని మాల అగర్తల చెరువు నిండి శివనగర్ మీదుగా వర్షపు నీరు వెళుతోంది. అలాగే మధ్యకోటలోని కాకతీయులకాలం నాటి స్వయంభూదేవాలయం నిండి లోనికి వర్షపు నీరు చేరింది. సింగారపుబావి నిండి సైతం నిండి నిండుకుండలా మారింది. శివనగర్ సబ్‌స్టేషన్‌లోకి నీరు చేరింది. బతుకమ్మ ఆటస్థలం పూర్తిగా నిండి పోయింది. శివనగర్, మైసయ్యనగర్, అండర్‌బ్రిడ్జి పాంతాల్లో రెండు రోజులుగా నీరు నిలిచి ఇళ్ళలోని ప్రజలు బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయి. కనీసం పాలు, కూరగాయలు సైతం బయటికి వచ్చి తెచ్చుకునే పరిస్థితిలేక ప్రజలు ఇళ్లలోనే ఉన్నారు. లోతట్టు గుడిసె ప్రాంతాలలోని వృద్ధులు, మహిళలు గుడిసెలు, ఇళ్ళలోనే ఉండిపోయారు. శివనగ ర్, అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల వద్ద యువకులు చేపలు పట్టుకున్నారు. వారిని మిల్స్‌కాలనీ పోలీసులు, ఖిలావరంగల్ మండల తహసీల్దార్ ఇక్బాల్, రెవెన్యూ అధికారులు స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు పునరావాసకేంద్రాలకు తరలించారు. వారికి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉదయం, మధ్యాహ్నం టిఫిన్, ఆహారం అందజేశారు. చింతల్ బ్రిడ్జి నుంచి ఖమ్మంరోడ్ మీదుగా వర్ధన్నపేట, నెక్కొండ, తొర్రూరు తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఎక్కడికక్కడ వర్షం నీరు రోడ్లపైకి వచ్చి వాహనాలను ఇతరప్రాంతాలకు వెళ్లకుండా చేశాయి. దీంతో ఖమ్మం, చింతల్ బ్రిడ్జిలపై వందలాది లారీలు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు రోడ్ల మీదనే నిలిచిపోయాయి.

లారీ డ్రైవర్లు, క్లీనర్‌లు టీ, టిఫిన్‌ల కోసం హోటల్ కోసం చూశారు. కాని ఎక్కడ హోటళ్లు లేకపోవడంతో వారు స్వయంగా అన్నం, కూరలు వండుకుని రోడ్లమీదనే భోజనాలు చేశారు. ప్రతిరోజూ ప్రభుత్వ, ప్రైవేట్, దినసరి కూలీలకు వెళ్లే ప్రజలు సైతం బయటకు వెళ్లలేక ఇళ్లలోనే ఉండిపోయారు. నిత్యావసరాలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మధ్యకోటలోని స్వయంభూదేవాలయంలోకి చేరిన వరద నీరు

ఎస్ఆర్‌నగర్‌ను సందర్శించిన సీపీ, కలెక్టర్



ఎస్ఆర్‌నగర్‌లో పర్యటించిన జిల్లా కలెక్టర్, సీపీ తదితర అధికారులు

వరంగల్‌సిటీ, అక్టోబరు 30: (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో జలమయమైన వరదనీటిలో చిక్కుకుని ఆడెపు క్రిష్ణమూర్తి (70) మృతి చెందిన విషయం తెలుసుకున్న కలెక్టర్ సత్యశారద, సీపీ సన్‌ప్రీత్‌సింగ్ గురువారం ఎస్ ఆర్‌నగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సుమారు అరగంటపాటు వరదనీటిని దారి మళ్లించేందుకు ఏం చేయాలని అధికారులతో సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, ఇంతియాజ్, కేతిరి రాజశేఖర్, ముడుసు నర్సింహ, స్టాలిన్, దామెర క్రిష్ణ, అంబాల సత్యం, తక్లపెల్లి రమేల, కేతిరి సమ్మక్క తదితరులు ఎస్ఆర్‌నగర్‌కు వరద నీటి ముప్పు తప్పించేందుకు లేబర్‌కాలనీ నుంచి ఏనుమాముల వరకు వందఫీట్ల రోడ్‌కు ఇరువైపులా 10 వెడల్పు, ఆరు ఫీట్ల ఎత్తుతో బాక్స్ డ్రైనేజీ నిర్మాణం చేస్తే సమస్య తలెత్త కుండా ఉంటుందని, అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నామని కలెక్టర్‌కు, సీపీకి వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్, సీపీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆర్ఎన్ఆర్ నగర్ వాసులకు పునరావాస కేంద్రం ఏర్పాటు

పోచమ్మమైదాన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పైడిపెల్లిలోని ఆర్ఎన్ఆర్ నగర్ భారీ వర్షాలకు నీట మునిగి ంది. ఎఆర్ఎన్ఆర్ నగర్ గుడిసెవా సులు నీట మునిగిపోవడంతో గురువారం స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణి అనిల్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే గుడిసె వాసులకు వ్యవసాయ పరిశోధనశాల కేంద్రానికి తరలించి పునరావాసం ఏర్పాటు చేశారు. సుమారు వంద మందిని సురక్షిత ప్రాంతానికి చేర్చి వారికి భోజనం, నీరు తదితర ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ శ్రేణులు జన్ను అనిల్‌కుమార్, బుద్దె పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి పై బుంగ..

భారీ వర్షాలతో రోడ్డు కుంగిపోయి పోచమ్మమైదాన్ - దేశాయిపేట ప్రధాన రహదారి 80 ఫీట్ రోడ్డు వద్దపై బుంగ ఏర్పడింది. భారీ వాహనాల రాకపోకలతో ఒక్కసారిగా పెద్ద బొంద (బుంగ) ఏర్పడడంతో స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. సమస్య పరిష్కరించారు. గ్రేటర్ వరంగల్ 12వ డివిజన్‌లోని మార్కండేయ కాలనీలో భారీగా వర్షపునీరు చేరడంతో స్థానిక కార్పొరేటర్ కావటి కవితయాదవ్ ఆధ్వర్యంలో వెంటనే సహాయక చర్యలు చే పట్టారు. కాలనీకి ఆనుకొని ఉన్న నాలాలో చెత్త చెదారం పేరుకపోయి వరదనీరు కాలనీని ముంచెత్తడంతో జేసీబీతో చర్యలు చేపట్టారు.



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రోడ్డుపై పడ్డ బుంగ ఇదే

కృష్ణాకాలనీ హైస్కూల్‌లోకి నీళ్లు

గిర్మాజిపేట, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలోని కృష్ణకాలని ప్రభుత్వ హైస్కూల్ బుధవారం నాటి భారీ వర్షంతో జలసంద్రంగా మారింది. పెద్ద ఎత్తున నీరు చేరడంతో ప్రహరీ వరకు నీళ్ల వచ్చాయి.



కృష్ణకాలని ప్రభుత్వ హైస్కూల్‌లో వరదనీరు

జీఆర్‌పీ స్టేషన్‌లోకి వరదనీరు

భారీ వర్షంతో రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపై ఉన్న ప్రభుత్వ రైల్వే పోలీసుస్టేషన్ (జీఆర్‌పీ) లోకి వరదనీరు చేరింది. ప్లాట్‌ఫాంకు ఆరడుగుల దిగువన సాక్షాత్తు దిగుడుబావి తరహాలో స్టేషన్ ఉంది. అంతేగాకుండా భవనం పై కప్పు రేకులు శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షం పడితే జీఆర్‌పీ లోకి వరదనీరు పెద్ద ఎత్తున చేరుతోంది. గురువారం రికార్డు రూంలోని వరదనీరులోనే సిబ్బంది పనిచేసు కున్నారు. రైల్వే అధికారలు శిథిలావస్థలో ఉన్న జీఆర్‌పీ భవనాన్ని కూల్చి నూతన భవనం నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శివనగర్‌కు శాశ్వత పరిష్కారం చూపాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న శామంతుల శ్రీనివాస్

ఖిలావరంగల్, 30(ఆంధ్రజ్యోతి):ఇటీవల కురిసిన వర్షాలకు శివనగర్ ప్రాంతంలో నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సందర్భంగా శాశ్వత పరిష్కారం చూపాలని నగర కమీషనర్ చాహత్ బాజ్‌పేయిని వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ గురు వారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇటీవల మంత్రి కొండా సురేఖకు సైతం శివనగర్ పరిస్థితిపై వినతిపత్రాన్ని అందజేశామన్నారు. కొన్నేళ్లుగా శివనగర్, అండర్ బ్రిడ్జి నీటిలో నిండిపోతుందన్నారు. నగరంలోని 34వ, డివిజన్‌లలోని శివనగర్, పెరకవాడ, అండర్‌బ్రిడ్జి, తదితర ప్రాంతాలలో నీరు నిలువకుండా శాశ్వత పరాష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు దుప్పట్ల పంపిణీ

ఖిలావరంగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రెండోరోజులుగా కురిసిన వర్షాలకు లోతట్టు గుడిసెవాసులను పునరా వాసకేంద్రానికి తరలించారు. గురువారం పునరావస కేంద్రంలో ఉన్న గుడి సెవాసులు, నిరుపేదలకు 300 మందికి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్ దుప్పట్లను పంపిణీ చేశారు. 34,35వ, డివిజన్ శివనగర్, మైసయ్యనగర్, శివగణేష్ నగర్, తదితర కాలనీలలో ఉదయం పాలప్యాకెట్లు, మధ్యాహ్నం అన్న పాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బింగి రాజేశ్వర్, శామంతుల కిరణ్, ఉమ, అజీరా, కట్ట శరత్, అరుణ, అంజమ్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయమందిస్తున్న కూరగాయల వర్తక సంఘం నాయకులు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) వరంగల్ లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షుడు జారతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మార్కెట్లో వ్యాపారం చేస్తూ చనిపోయిన 20 కుటుంబాలకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. గురువారం కూరగాయల మార్కెట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మార్కెట్ ప్రధాన కార్యదర్శి గులాం సర్వర్ మున్నా, కార్పొరేటర్లు చింతాకుల అనిల్, సోమిశెట్టి ప్రవీణ్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ హాజరయ్యారు. చనిపోయిన వ్యాపారుల కుటుంబాలకు రూ.20 వేలు, హమాలీ కార్మికుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున 20 కుటు ంబాలకు ఆర్థికసాయం అందించారు. మల్లారి బాబూరావు, ఎంఏ. బాబు, కాసర్ల రాజు, పిన్న మల్లేశం, వీరన్న, శ్రీహరి, యుగందర్. కుమార్, శ్రీనివాస్, సాంబయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను ఆదుకోవాలి

శంభునిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ తో నగరంలోని పలు కాలనీలు నీట మునగడంతో తీవ్రంగా నష్టపోయారని ముంపు ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రంగశాయిపేట కాలనీల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కర్నె రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి రంగశాయిపేట, శంభునిపేట, ఉర్సు ప్రాంతాలలోని నాగేంద్రనగర్, కాశికుంట, అరుణోదయ కాలనీ, విశ్వనాదకాలనీ, గణేష్ నగర్, టీచర్స్ కాలనీ, వినాయకనగర్, మంగళమ్మకుంట, తెలంగాణ కాలనీ, లెనిన్ నగర్, పలు కాలనీల్లోని ముంపు ప్రాంతాలను గురువారంకమిటీ బాధ్యులతో కలిసి కర్నె రవీందర్ పరిశీలించారు కార్యక్రమంలో పలు కాలనీల బాధ్యులు పెద్ది ఎల్లయ్య, శ్రీనాథ్, మాల్యాద్రి, లక్ష్మయ్య, రవీందర్, మిరియాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు ..

ఖిలావరంగల్ : నగరంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి లోతట్టు గుడిసె ప్రాంతాలు నీటమునిగాయి. గురువారం 34,35 డివిజన్లకు చెందిన శివనగర్, మైసయ్యనగర్ గుడిసేవాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. దీంతో ప్రభుత్వం శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పునరావాకేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో వున్న ప్రజలకు స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం అన్నం అందజేశారు.



ఆహారం పంపిణీ చేస్తున్న సోమిశెట్టి ప్రవీణ్

ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న మీసాల ప్రకాష్

గిర్మాజిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షంతో ముంపునకు గురైన వరంగల్ నగరంలోని 27వ డివిజన్ పరిధిలోని కొండా పటేల్ కాలనీని గురువారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ సమీపంలోని కొండా పటేల్ కాలని బుధవారం ముంపుకు గురైన విషయం విధితమే. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ కొండా పటేల్ కాలనీ ముంపు సమస్యను బుధవారం మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకుపోయి గ్రేటర్ బల్దియా అధికారుల సహకారంతో కాలనీలో నీరు తొలగించారు. అలాగే టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ గురువారం సాయంత్రం కొండా పటేల్ కాలనీని సందర్శించి ముంపు బాధితులకు ఆహారం అందజేశారు. మంత్రి కొండా సురేఖ సహకారంతో కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండా పటేల్ కాలనీఅధ్యక్షుడు దౌడు నాగరాజు, స్థానికులు శ్యామల మార్క్, వాడపల్లి రవి, షేక్ సలీం, శ్రీలత, సరళాదేవి, రేణుక, విజయలక్ష్మి, రబ్బాని, శ్రీకాంత్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొండా పటేల్ కాలనీ ముపునకు గురైతే స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ కనీసం కాలనిని సందర్శించక పోవడంపై కాలనీవాసులు కార్పొరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోటలో సంస్మరణల సభల పోస్టర్ ఆవిష్కరణ

ఖిలావరంగల్,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దోపిడీ, పీడన, కుల, మత, ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం చేసిన పోరాటంలో అమరులైన వీరులను స్మరించుకుంటూ నవంబరు 1 నుంచి 7 వరకు గ్రామ, గ్రామాన జరుగు సంస్మరణ సభలను విజయవంతం చేయాలని సీపీఐ-ఎంఎల్, మాస్‌లైన్ జిల్లా నాయకుడు చిర్ర సూరి పిలుపునిచ్చారు. గురువారం ఖిలావరంగల్ చమన్ వద్ద సీపీఐ -ఎంఎల్, మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో భూస్వామ్య లక్షణాలను, పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థను కూకటివేళ్లతో పెకలించివేసి, పీడిత, తాడిత ప్రజల రాజ్యాన్ని స్థాపించడానికి 58 ఏళ్లగా పోరాడుతుందన్నారు. రాజ్యహింసకు, బూటకపు ఎన్‌కౌంటర్‌లకు, శత్రుదాడులకు వేలాది విప్లవవీరులను గుర్తు చేసుకునే విషయంలో నవంబర్ 1 నుంచి 7 వరకు జరుగు సంస్మరణ జభలను ప్రజలు ప్రజాస్వామికవాదులు విజయవంతం చేయాలన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో సీపీఐ-ఎంల్, మాస్‌లైన్ వరంగల్ డివిజన్ నాయకులు మైదం పాణీ, సాబినికారి మోహన్, మురళీ, ఆసాక్, వెంకటేశ్వర్లు, రవి, స్వామి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ

రాష్ట్ర కార్యదర్శిగా కేడల ప్రసాద్



శంభునిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా నగరంలోని రంగశాయిపేటకు చెందిన కేడల ప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సమాచార హక్కు చట్టం సామాన్యులకు ఎంతగానో ఉపయో గపడుతుందని ప్రసాద్ తెలిపారు. కాగా కేడ ప్రసాద్‌కు పలువురు ప్రజాసంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

పరిశోధనల్లో సాంకేతికతతో పోటీపడాలి

శంభునిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యార్థులు తమ పరిశోధనల్లో సాంకేతికతతో పోటీ పడాలని ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీలిన్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ సీఈవో నందెపు అఖిల్ అన్నారు. నగరంలోని బొల్లికుంట వాగ్దేవీ కళాశాలలో ఐఈఈఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ టెక్నాలజీ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్ లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని అఖిల్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించి మట్లాడారు. విద్యారంగంలో ఏఐ ప్రాముఖ్య తతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి విద్యార్థులు తెలుసుకోవా లన్నారు. ఇలాంటి సదస్సులు పరిశోధనాత్మక విద్యార్థులకు ఉపయోగ పడుతాయన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ము స్తాక్ అహ్మద్ మాట్లాడు తూ వాగ్దేవిలో తొలిసారి అంతర్జాతీయ స్థాయి సదస్సును నిర్వహించు తున్నామన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు దేశ, విదేశాలలోని వెయ్యికి పైగా దరఖాస్తులు చేసుకోగా 256 ఆవిష్కర ణలను ఎంపిక చేశామన్నారు. 33 ఆన్‌లైన్, 3 ఆఫ్‌లైన్ వేదికల మీద సదస్సును నిర్వహించుతున్నామని తెలిపారు. కళాశాల విద్యార్థులతో పాటు రాష్ట్రంలోని ఔత్సాహిక పరిశోధక విద్యార్థులకు ఉపయో గపడేలా ఈ సదస్సును కళాశాలలో నిర్వహించుతు న్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు పరిశోధనాత్మక ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యత, ఉత్పత్తి విధానాలను గురించి వివరించారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహకులు ప్రొఫెసర్‌లు కె.షర్మిల, పి మహిపాల్‌రెడ్డి, రేఖ గంగుల, వి మనోహర్, శ్రీనివాస్ కళ్యాణపు, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఈవో నందెపు అఖిల్


వాగులో కొట్టుకుపోయిన ప్రేమజంట


గల్లంతైన బక్క శ్రావ్య

గల్లంతైన యువతి.. ప్రాణాలతో బయటపడిన యువకుడు

- స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గడ్ వైపు వస్తుండగా ఘటన
- యువతి కోసం రెస్క్యూ టీం గాలింపు
- కన్నీరుమున్నీరవుతున్న యువతి తల్లిదండ్రులు

7


జలమయమైన వరంగల్ ప్రాంతం ఏరియల్ వ్యూ


హంటర్ రోడ్‌లో ప్రజలను తరలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


వరద బాధితులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీ కావ్య


హంటర్‌రోడ్‌లో నీట మునిగిన వాహనం



భట్టుపల్లి రోడ్ మైసయ్యనగర్‌లో చిక్కుకున్న ప్రజలను ఒడ్డుకు చేరుస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


వరదల్లో చిక్కుకున్న వారికి మంత్రి సురేఖ సమక్షంలో డ్రోన్ సహాయంతో నిత్యావసరాలను పంపిస్తున్న దృశ్యం

వరద బీభత్సం.. వణికిన నగరం

చారిత్రక నగరిని అతలాకుతలం చేసిన మొంథా తుపాను

- పలు కాలనీలను, లోతట్టు ప్రాంతాలను చుట్టుముట్టిన వరద నీరు
- జల దిగ్బంధంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకురాని పరిస్థితి
- సహాయక చర్యలు చేపట్టిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం
- బోట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- మంత్రి సురేఖ, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్ల విస్తృత పర్యటనలు
- వరద పీడిత ప్రాంతాల్లో సమస్యల పరిశీలన
- ప్రధాన రహదారులపై స్తంభించిన వాహనాల రాకపోకలు
- లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు రావడంతో తీవ్ర నష్టం
- భారీ వర్షాలకు దెబ్బతిన్న అనేక రోడ్లు
- వరదనీటిలో మునిగి ఒకరు మృతి
- తీవ్రంగా దెబ్బతిన్న పంటలు.. అన్నదాతల కన్నీరుమున్నీరు

హనుమకొండ, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన అతి భారీవర్షాల వల్ల అతలాకుతలమైన వరంగల్, హనుమకొండ జిల్లాలు క్రమంగా కోలుకుంటున్నాయి. గురువారం తెల్లవారుజాము నుంచి వర్షాలు పడడం ఆగిపోవడంతో పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున నిలిచిన వరద నీరు క్రమంగా తగ్గుముఖం పడుతోంది. అయినా ఇంకా అనేక ప్రాంతాలు ఇప్పటికీ వరదనీటి దిగ్బంధంలోనే చిక్కుకొని ఉన్నాయి. ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో ప్రజలు ఇంకా బయటకు రాలేకపోతున్నారు. సహాయక కేంద్రాలకు కొంత మంది తరలివెళ్లగా.. మిగతా వారు కాలనీల్లో తమ ఇళ్లు, డాబాలపైకప్పులపైనే నిరీక్షిస్తూ గడపడం కనిపించింది. బుధవారం ఉదయం నుంచి వారంతా తినడానికి తిండి, తాగడానికి మంచినీళ్లు లేక నానా ఇబ్బందులు పడ్డారు. రాత్రంతా భయం భయంగా గడిపారు. మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీష్, మేయర్ గుండు సుధారాణి, నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఉదయం వరద పీడిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. వరద బీభత్సాన్ని కళ్లారా చూశారు. వరద బాధితులతో మాట్లాడారు. వారికి అందుతున్న సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు. పాలప్యాకెట్లు,

(మిగతా 6లో..)


కేయూ బైపాస్ రోడ్‌లోని సమ్మయ్య నగర్ వద్ద పోటెత్తుతున్న వరద


వరద ముంపు బాధితురాలిని ఓదార్చుతున్న మంత్రి కొండా సురేఖ


నగరంలో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్


ఖమ్మం బైపాస్ జంక్షన్ జలమయం

ఇరిగేషన్ అధికారుల నిద్రమత్తు

- వారి నిర్లక్ష్యంతో నీట మునిగిన 50కి పైగా కాలనీలు
- గోపాలపురం-సమ్మయ్యనగర్ వద్ద టన్నెల్ గేట్ ఎత్తక పోవడంతో వరద బీభత్సం
- గోపాలపురం చెరువుకు గండిపడటంతో తీవ్ర నష్టం
- ఇళ్లల్లోకి చొచ్చుకువచ్చిన వరదనీరు
- నీటిపాలైన వస్తువులు.. జనం నానా ఇబ్బందులు

6

నేడు సీఎం రాక

- నీట మునిగిన నగరంలో ఏరియల్ సర్వే
- పలు ప్రాంతాలను సందర్శించనున్న సీఎం
- కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో సమీక్ష



వరంగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొంథా తుపాన్‌తో జలమయమైన వరంగల్ నగరాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించనున్నారు. తుఫాన్‌తో వరంగల్ నగరంలోని అనేక కాలనీలు నీటమునగగా రోడ్లు, పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలో గురువారం జిల్లా అధికారులు మంత్రి కొండా సురేఖతో కలిసి వర్షాల కారణంగా జరిగిన నష్టాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూనే శుక్రవారం వరంగల్ నగరాన్ని సందర్శించనున్నట్లు సీఎం పేర్కొన్నారు. తొలుత వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని పలు ప్రాంతాలను ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. అనంతరం హనుమకొండ, వరంగల్ పట్టణాల్లోని నీట మునిగిన పలు కాలనీలను సీఎం సందర్శించి బాధితులతో మాట్లాడనున్నారు. లోతట్టు ప్రాంతాల్లో బాధితులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను సీఎం పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షించనున్నారు. నగరంలో వరదలకు, లోతట్టు ప్రాంతాలు నీటమునగడానికి గల కారణాలపై సమీక్షించనున్నారు. భవిష్యత్‌లో వరంగల్ నగరానికి వరద ముప్పు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులతో చర్చించనున్నారు. ఇప్పటికే నగరంలో రూ.5170కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులకు సంబంధించిన పురోగతిపై సీఎం చర్చించనున్నారు. కాగా, సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

వరంగల్-హనుమకొండ మధ్య రాకపోకలకు బ్రేక్

మట్టివాడ(వరంగల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో వరద పోటెత్తడంతో వరంగల్-హనుమకొండ పట్టణాల మధ్య రాకపోకలకు బ్రేక్ పడింది. ఈ పరిస్థితి బుధవారంతో పాటు గురువారం కూడా కొనసాగింది. ప్రధానంగా అలంకార్ జంక్షన్, ములుగురోడ్ జంక్షన్ వద్ద, అలాగే హంటర్‌రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు రాకపోకలను బంద్ చేశారు. దీంతో వాహనాలు అందుబాటులో లేక జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనులున్న వారు నానా వెతలకు గురయ్యారు. ప్రత్యామ్నాయ దారుల గుండా రాకపోకలకు ప్రయత్నించారు. హంటర్‌రోడ్‌లో బొందివాగు పొంగి ప్రవహించడంతో వరద ఉధృతి పెరిగి రామన్నపేట, పోతననగర్, హంటర్ రోడ్‌లోని సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీలను నీరు ముంచెత్తింది.


హనుమకొండలోని అలంకార్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు


హనుమకొండ 100 ఫీట్ల రోడ్డులో వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

రికార్డు స్థాయిలో వర్షపాతం

హనుమకొండ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో వందేళ్ల చరిత్రలో మరోసారి భారీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం మొత్తం 225.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఇది హనుమకొండలో ఇప్పటివరకు నమోదైన రెండో అత్యధిక వర్షపాతంగా రికార్డుల్లో నిలిచిందని వాతావరణ నిపుణులు తెలిపారు. అయితే అక్టోబర్ నెలలో నమోదైన వర్షపాతాలను పరిశీలిస్తే.. గత వందేళ్లలో ఇదే అత్యధికమని వారు తెలిపారు. 1903 జూలై 13న 227.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు ఇదే అత్యధికం. అయితే అక్టోబరును తీసుకుంటే.. 1995 అక్టోబరు 18న 146 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా దంచికొట్టిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. రహదారులను వరద ముంచెత్తడంతో జనజీవనం అతలాకుతలమైంది.

ఇంటింటికీ వైద్యసేవలు

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్

నెక్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా ప్రజలు వ్యాధులకు గురవుతుండటంతో ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ తెలిపారు. మండలంలోని నెక్కొండ, అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్యసేవలు అందిస్తుండటంతో అభినందించారు. కార్యక్రమంలో నెక్కొండ, అలంకానిపేట మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ తన్వీర్ రహేలా, డాక్టర్ సుమన్, డాక్టర్ అఖిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ బీసీ జేఏసీ కన్వీనర్‌గా విజయకుమార్

నెక్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ జేఏసీ కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్టు డాక్టర్ గటిక విజయకుమార్‌ను నియమించినట్లు రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర బీసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య గురువారం విడుదల చేసిన ప్రకటనలోపేర్కొన్నారు. నెక్కొండకు చెందిన విజయ్‌కుమార్ పలు సామాజిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తుండటంతో గుర్తించి కన్వీనర్‌గా నియమించడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించడంతో పాటు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు సాధించి రాజ్యాధికారంలో వాటా దక్కించుకోవడమే లక్ష్యంగా తనవంతు కృషి చేస్తానని విజయ్‌కుమార్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ రథయాత్ర నిర్ణయించుటకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

ముంచిన మొంథా తుఫాన్

- వేల ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట
- ఉప్పరపల్లిలో వరదలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు
- ఉగ్రరూపం దాల్చిన ఆకేరు వాగు
- ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు



ఖానాపురం కొత్తూరులో నీటమునిగిన పంటను పైకి లేపుతున్న రైతులు

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వరి పంట రైతులను నిండా ముంచింది. బుధవారం రాత్రి వరకు కురిసిన వర్షానికి వర్ధన్నపేట పట్టణంతో పాటు మండలంలో దాదాపు 4 వేల ఎకరాలకు పైగా వరి పంట నేలకొరిగింది. సుమారు 700 ఎకరాల్లో పత్తి పంట నీటి పాలైంది. మొక్కజొన్న సైతం కొన్ని చోట్ల దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు స్పష్టం చేశారు. 28 సెంటీ మీటర్లకు పైగా కురిసిన వర్షానికి మండలంలోని దాదాపు అన్ని చెరువులు సైతం మత్తడి పోశాయి. మండలంలోని బండౌతపురం, దివిటిపల్లి, దమ్మన్నపేట చెరువులు మత్తడి పోయడంతో పాటు కోనాయిచలం నుంచి కట్టు కాలువ ద్వారా నీరు వర్ధన్నపేట కోనారెడ్డి చెరువులోకి చేరడంతో ఐదేళ్ల తర్వాత మళ్లీ కోనారెడ్డి చెరువు అలుగు పోయడం కనిపించింది. ప్రస్తుతం 24 ఫీట్లకు పైగా నీరు వచ్చి చేరడంతో ప్రమాదం జరగకుండా ఇరిగేషన్ డీఈ చెరువును సందర్శించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

మండలంలోని ఉప్పరపెల్లి గ్రామంలోని చల్ల భిక్షపతి, సీనపెల్లి ఓదెలయ్య, కొమ్ము మల్లయ్యలకు చెందిన వరి ధాన్యం ఐకేపీ కేంద్రంలో కుప్పలు పోశారు. అకాల వర్షానికి ధాన్యం పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో రైతులు ట్రాక్టర్‌లోకి ఎత్తి తీసుకెళ్లారు. ఉప్పరపెల్లిలోని ఎల్లమ్మ చెరువు మత్తడి పోయడంతో ప్రధాన రహదారిపై వరద నీరుగా భారీగా ప్రవహించింది. దీంతో నల్లబెల్లి గ్రామం నుంచి వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెళ్తుండగా నీటిలో చిక్కుకుంది. బస్సులో 15 మంది ప్రయాణికులు ఉండగా అందరినీ స్థానికులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. కొత్తపల్లి, ల్యాబర్తి గ్రామాల్లో ఆకేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. వర్ధన్నపేటలోని పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలు జల దిగ్బంధంలో ఉండగా జేసీబీ సహాయంతో నీరు పోయేలా మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో నేలకొరిగిన వరి పంటను ఏవో విజయ్‌కుమార్ పరిశీలించారు. దెబ్బతిన్న పంటను అంచనా వేసి జిల్లా అధికారులకు పంపించినట్లు తెలిపారు.

• పర్వతగిరి(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. పలు గ్రామాల్లో కాలనీలకు నీరు చేరగా ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీవో శేషాంజనేయ స్వామిలు గ్రామాలను సందర్శించి కార్యదర్శు



రోళ్లకల్లు చెరువు ముందు తండాకు వెళ్లే దారి జలమయం

లతో కార్యాలయాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు ఎప్పటికప్పుడు కేంద్రాలకు తరలించారు. కొన్ని చెరువులు మత్తళ్లు పడి ఉధృతంగా ప్రవహించడంతో రోడ్లు జలమయమయ్యాయి. కొన్ని లోలెవల్ కల్వర్టుల పైనుంచి నీరు ప్రవహించగా దారులను ట్రాక్టర్ల డబ్బాలు అడ్డుగా పెట్టి మూసివేసి వాహనాలను దారి మళ్లించారు. జమాల్‌పురం, రోళ్లకల్లు చెరువు ముందు తండాల వద్ద ప్రధాన రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. చింతనెక్కొండ గ్రామంలో అరటి చెట్లు నేలకూలాయి. రోళ్లకల్లు చెరువుకు గండి పడగా స్థానిక తహసీల్దార్ వెంకటస్వామి, ఇరిగేషన్ డీఈ రాజుతో కలిసి సిబ్బందితో గండికి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. తుఫాను కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలగగా ఏడీఈ తిరుపతి సిబ్బందితో కలిసి అన్ని గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరణ చేశారు. మండల వ్యాప్తంగా 8,800 ఎకరాల్లో వరి, 2,500 ఎకరాల్లో పత్తి, 75 ఎకరాల్లో అరటి తోటలకు నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేసినట్లు ఏవో ప్రశాంత్ కుమార్ తెలిపారు.

• చెన్నారావుపేట(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది, చెన్నారావుపేట నుంచి నర్సంపేటకు రాకపోకలు గురువారం నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని పెద్ద మోరీపై వరద ఉధృతంగా ప్రవహించడంతో నర్సంపేట నుంచి నెక్కొండకు ప్రయాణికులతో రాత్రి సమయంలో వెళ్లుతున్న ఆటో రోడ్డు పక్కకు దూసుకపోయి కింద పడిపోయింది. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. సాయి అనే యువకుడు తాడు సాయంతో ప్రయాణికులను రక్షించాడు. అలాగే వరిపంటలు నెలవాలాయి.పత్తి పంట పలుచోట్ల నీట మునిగింది. పాకాల వాగు, పెద్ద మోరీ వద్ద వాగు ఉధృతంగా ప్రవాహిస్తున్నాయి. పాపయ్యపేట - తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామాల మధ్య ఉన్న మోరీలు కొట్టుకపోవటంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో పంటలను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బాల్నె వెంకన్నగౌడ్, మాజీ ఎంపీపీ జక్క అశోక్, మురహరి రవి, అమ్మ రాజేష్, బోడ మురళీనాయక్, మహేందర్‌రెడ్డి, అనుముల కుమారస్వామి, రమేష్ పాల్గొన్నారు.



దుగ్గొండి మండలం తిమ్మంపేటలో వరదలో మునిగిన వరిపంట

• దుగ్గొండి(ఆంధ్రజ్యోతి): మండలంలో వరి, అరటి, మొక్కజొన్న పంటలకు అపార నష్టం వాటిల్లింది. బుధ, గురు వారాలలో కురిసిన భారీ వర్షాలతో చేతికందిన వరి, అరటి, మొక్కజొన్న పంటలు నేల వాలాయి. తిమ్మంపేట, నాచినపల్లి, చాపలబండ, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో వరి, అరటి పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు సర్వే చేసి నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తిమ్మంపేట, శివాజీ నగర్ తదితర గ్రామాల్లో గాలిదుమారంతో చెట్లు కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దుగ్గొండి, లక్ష్మీపురం మధ్య ఉన్న లోలెవల్ కాజ్‌వేపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు ఆగాయి. తిమ్మంపేట, నారాయణతండా గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. బుధవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లో ప్రజలు కాలం గడిపారు. కాగా, పంటలను సర్వే చేసి ఎకరానికి రూ.25 వేలు నష్ట పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. తిమ్మంపేటలో భారీ వర్షంతో నేలవాలిన వరి పంటలను బీఆర్ఎస్ నాయకులు సందర్శించి పరిశీలించారు.

• ఖానాపురం(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పాకాల ఆయకట్టులో వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. పొట్టదశకు చేరుకున్న సమయంలో వరి పంట నీటమునగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పత్తి, మొక్కజొన్న పంటలు సైతం దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నష్టపోయిన పంటలకు సర్వే చేయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. అశోక్‌నగర్ శివారులోని లోలెవల్ కాజ్‌వే పైనుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నర్సంపేట-కొత్తగూడ రాకపోకలు నిలిచిపోయాయి. పాకాల



సంగెం మండలం గవిచర్లలో వర్షానికి నేలకొరిగిన వరి పంట



ఉప్పరపెల్లి గ్రామ శివారులో వరద నీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

సంగెం కాలువ సమీపంలో ప్రధాన రహదారిపై వృక్షాలు నేలకొరగడంతో ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు తొలగించారు. రంగాపురం శివారులో భారీ వృక్షం ప్రధాన రహదారిపై నేలకొరగడంతో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకురాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా సైతం నిలిచిపోయింది. గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించినా పట్టించుకోకపోవడంతో గ్రామస్థులే ఆ వృక్షాన్ని తొలగించారు. వర్షాలకు ధర్మరావుపేటలో-1, మంగళవారిపేటలో-1, రంగాపురం-1, ఖానాపురంలో-9, అశోక్‌నగర్‌లో-2, దబీర్‌పేటలో-3, మనుబోతులగడ్డలో-5 ఇళ్లు కూలిపోయాయి. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ సిబ్బంది సరిచేసారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పెద్దమ్మగడ్డ శివారులో వర్షాలకు దెబ్బతిన్న పాకాల ఆయకట్టు పరిధిలోని వరి పంటలను పరిశీలించారు.

• సంగెం(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కురిసిన వర్షానికి పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. పలు గ్రామాల్లో మక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. కాపులకనపర్తిలో



రాయపర్తిలో వరద నీటిలో కొట్టుకుపోయిన వరి పంట

వరద నీరు రోడ్డుపైకి రావడంతో కోతకు గురై రాకపోకలకు అంతరాయం కలిగింది. అదే విధంగా సంగెం-చింతలపల్లి గ్రామాల మధ్య వాగు ఉధృతికి రాకపోకలు బంద్ అయ్యాయి. వాగు ప్రవాహంను మామునూరు ఏసీపీ వెంకటేశ్, పర్వతగిరి సీఐ రాజగోపాల్ పరిశీలించి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సంగెం ఊర చెరువుకు గండి(కుంగి) పడింది. సంబందిత శాఖ అధికారులు పరిశీలించారు. పల్లార్‌గూడ శివారులో ఎకరన్నర అరటి తోట నేలకొరిగి గెలలు ధ్వసమై రూ.6లక్షల నష్టం జరిగిందని రైతు బానోతు దేవ్‌సింగ్ లబోదిబోమంటున్నాడు. కాగా, వర్షాలకు పంటల నష్టం వివరాలను వ్యవసాయ శాఖ అధికారి జగదీష్ తెలిపారు. 3,770 ఎకరాల్లో వరి, 3,520 ఎకరాల్లో పత్తి, 30 ఎకరాల్లో మక్కజొన్న నష్టంను ప్రాథమికంగా అంచనా వేసినట్లు చెప్పారు.

• రాయపర్తి(ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలతో దాదాపు 6,500 ఎకరాల్లో వరి పంట, 2,400 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిందని ఏవో వీరభద్రం తెలిపారు. మైలారం గ్రామంలోని రిజర్వాయర్ గేట్లను ఎత్తి దిగువకు జలాలను విడుదల చేశారు. ఊకల్, మైలారం రోడ్డు డ్యామ్ దగ్గర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో కాంగ్రెస్ నాయకులు మాచర్ల ప్రభాకర్, ఎండీ నయీం, సమ్మయ్య, కళ్యాణ్ సందర్శించి పరిస్థితిని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి తెలపడంతో అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి, పంట నష్టం అంచనా వేయాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇళ్లు కూలిన వారికి వెంటనే ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. మండలకేంద్రంలో పంట నష్టపోయిన రైతులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. నేలకొరిగిన పంటను పరిశీలించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• గీసుగొండ(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో మండలంలో వరి, మొక్కజొన్న, పత్తి, మిరప, కూరగాయ పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. భారీ వర్షంతో వరద ఉధృతికి రోడ్లు ధ్వంసమయ్యాయి. పలు రోడ్లు కొట్టుకుపోగా, వరంగల్ -నర్సంపేట ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. కమర్షియల్ కాంప్లెక్స్ సమీపంలో వరంగల్ ప్రధాన రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. కాజ్‌వేల వద్ద కూడా వరద ఉధృతికి రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సంబంధిత అధికారులు రోడ్లను వెంటనే మరమ్మతులు చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరుతున్నారు. ఈదురు గాలులతో చెట్లు విరిగి పడటంతో పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మొగిలిచర్లలో కందుల మొగిలికి చెందిన పసుపు తోటలో భారీ వృక్షం పడటంతో పంటకు తీవ్రనష్టం వాటిల్లిందని వాపోయారు. రోడ్లపై విరిగి పడిన చెట్లను పోలీసులు తొలగించారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరగటంతో బుధవారం రాత్రి కొన్ని గ్రామాల్లో పూర్తిగా విద్యుత్ సరాఫరా నిలిచిపోయంది. విద్యుత్ అధికారులు, సిబ్బంది గురువారం మధ్యాహ్నం వరకు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.



గీసుగొండ-మొగిలిచర్ల మధ్య కొట్టుకుపోయిన రోడ్డు

• నర్సంపేట(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ దం డారి శ్రీలత, రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గురిజాల లో నేలవాలి నీటమునిగిన వరి తదితర పంటలను బీఆర్ఎస్ నాయకులు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగం, గడ్డం కొమురయ్య, రాయపురెడ్డి, మోటూరి రవి, రాజమల్లు, అల్లిరవి, మం చిక హరీష్, సంగెం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దెబ్బతిన్న వరి, మొక్కజొన్న తదితర పంటలను ఐకేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశెట్టి సదానందం ఎంసీపీఐ(యూ), ఏఐకేఎఫ్ నాయకులతో కలిసి సందర్శించారు.

తుపాన్ కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్)రాష్ట్ర నాయకుడు మోడెం మల్లేశం ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఉద్యోగికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ తుఫాన్‌తో జిల్లాలో, నర్సంపేట డివిజన్‌లో పత్తి, మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, కుంటలు, కాల్వలను వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్ర ఆనంద్, జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి, భూమ అశోక్, బర్ల గౌరవయ్య, ఈర్ల అనిల్‌కుమార్, మానగాని సందీప్ తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు



నర్సంపేట మండలం గురిజాలలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రతీ రైతును ఆదుకుంటాం

• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లో అత్యధికంగా 20 నుంచి 30 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో వరి పొలాలు కొన్ని దాదాపుగా కోత దశకు వచ్చాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారుగా 60వేల నుంచి 70వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వర్ష బీభత్సం వల్ల రవాణా సౌకర్యం సరిగాలేనందున వరి పంట ఎంత నష్టం జరిగిందని అధికారులు పూర్తి స్థాయిలో అంచనావేయలేకున్నారని అన్నారు. వర్ష ప్రభావం తగ్గినందున రెండు మూడు రోజుల్లో పంట నష్టం పూర్తి స్థాయిలో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వరి పంట తోపాటు పత్తి, మిర్చి నష్టపోయిన వివరాలు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గంలో ధ్వంసమైన లోలెవల్ వంతెనలు, కాజ్‌వేలు, కల్వర్టులకు మరమ్మతులు చేస్తామని ఎమ్మెల్యే మాధవరెడ్డి తెలిపారు. నెక్కొండ సమీపంలోని దయ్యాల వాగు, చెన్నారావుపేట సమీపంలోని ముగ్ధుంపురం లోలెవల్ వంతెన, గూడూరు-నెక్కొండ ప్రధాన రహదారిలో రెండు చోట్ల వరద ప్రభావితం తగ్గలేదన్నారు. మరోసారి ఈ లోలెవల్ వంతెనల వద్ద వరద వలన రాకపోకలకు అంతరాయం కలగకుండా నెక్కొండ సమీపంలోని దయ్యాల వాగు, చెన్నారావుపేట సమీపంలోని ముగ్ధుంపురం, దుగ్గొండి మండలం నందిగామ, నర్సంపేట మండలం మాధన్నపేట, ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లలోని లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసామన్నారు. హామ్ ప్రోగ్రాం ద్వారా నర్సంపేట-వరంగల్ ఫోర్ లైన్ వే, నర్సంపేట నెక్కొండ 10 మీటర్లు, నెక్కొండ కేసముద్రం 10 మీటర్లు, నర్సంపేట మహమ్మద్‌గౌస్‌పల్లి వయా నల్లబెల్లి 7 మీటర్లు పెంచాలని కోరుతూ సెంట్రల్ డెవలప్‌మెంట్‌కు నివేదిక పంపినట్లు ఎమ్మెల్యే మాధవరెడ్డి తెలిపారు. నర్సంపేట పట్టణ అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.25 కోట్లు ప్రభుత్వం నుంచి నిధులు వచ్చాయని, మరో రూ.20 కోట్లకు ప్రతిపాదన పంపినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవో ఉమారాణి పాల్గొన్నారు.

వర్ష బీభత్సం బాధాకరం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- దెబ్బతిన్న రోడ్లు.. వేల ఎకరాల్లో పంటల నష్టం

నెక్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎడతెరిపి లేకుండా 31 సెంటీమీటర్ల అతి భారీ వర్షం కురవడం బాధాకరమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. వర్ష బీభత్సంతో పంటల నష్టంతో పాటు రహదారులు దెబ్బతిన్నాయని చెప్పారు. మొంథా తుఫాన్ కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలు, రోడ్లను గురువారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారుల ప్రాథమిక సర్వే ప్రకారం మండలంలో రైతుల చేతికి అందివచ్చిన దాదాపు 7వేల ఎకరాల వరి, 3వేల ఎకరాల పత్తి, మక్కజొన్న, అరటి, మిర్చి పంటలు దెబ్బతినడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నెక్కొండ-కేసముద్రం, గూడూరు, నర్సంపేట, పెద్దకొర్పోలు, ఇంటికన్నెరైల్వే స్టేషన్ మార్గాల్లోని రోడ్లలో ఉన్న లోలెవల్ వంతెనలు దెబ్బతినడంతో రాకపోకలు బంద్ అయ్యాయన్నారు. ఈ దారుల్లో శాశ్వత బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణంకు గాను రూ.160 కోట్ల నిధుల మంజూరికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. పలు గ్రామాల్లో వర్షం కారణంగా ఇళ్లు కూలిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. నెక్కొండలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యుత్ సమస్య నివారణకు గాను సోలార్ సిస్టం ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని మిగతా గ్రామాల్లో వర్ష బీభత్సవంపై అధికారులు సర్వేలు జరుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బక్కి అశోక్, చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్, లావుడ్యా తిరుమల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో యాసం లావణ్య, ఎస్సై మహేందర్, ఎంపీవో దయాకర్ పాల్గొన్నారు.



నెక్కొండ మండలంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

పంటల నష్టంపై సర్వే చేయండి

చెన్నారావుపేట(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజుల పాటు కురిసిన మొంథ తుఫాన్‌తో పంటలకు జరిగిన నష్టంను అంచనా వేయాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. చెన్నారావుపేట మండల కేంద్రంలో గురువారం అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 7వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు తెలుస్తుందన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి డ్రోన్ కెమెరాలతో పంటల నష్టంను అంచనా వేయాలన్నారు. పంట నష్టంపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలన్నారు. అలాగే నష్టంపై కలెక్టర్, ఆర్డీవోల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో నివేదికను అందిచాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సిద్దెన రమేష్, మొగిలి వెంకటరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్, ఎంపీడీవో వెంకటసాయినంద్, తహసీల్దార్ అమీద్‌అలీ, నెకొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయి 25 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

నెక్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురపల్లి గ్రామ శివారులో మేతకు వెళ్లిన 25 గొర్రెలు బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయి మృతి చెందాయి. గురువారం గ్రామస్థులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన బోళ్ల కుమారస్వామి గొర్రెలను మేత కోసం బుధవారం ఉదయం అడవికి తోలుకెళ్లాడు. జోరుగా వర్షం వస్తుండటంతో గొర్రెలను తోలుకొని ఇంటికి వస్తున్న క్రమంలో వట్టివాగు దాటుతుండగా ఒక్కసారిగా వరద పెరగడంతో గొర్రెలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఈ ప్రమాదం నుంచి కుమారస్వామి బయటపడ్డాడు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన 25 గొర్రెలు మృతి చెందగా, దాదాపు రూ.3.50 లక్షల నష్టం జరిగింది.

జువైనల్ హోంకు బాలుడి తరలింపు

ఖానాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ తండాకు చెందిన నాలుగేళ్ల బాలికపై అదే తండాకు చెందిన బాలుడు(16) ఇటీవల లైంగిక దాడికి పాల్పడిన విషయం విదితమే. దీంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా బాలుడిని అదుపులోకి తీసుకుని గురువారం వరంగల్‌లోని జువైనల్ హోంకు తరలించినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండౌతపురం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కత్తుల కొమురయ్య(70) కొంత కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతూ మనస్తాపంతో ఈనెల 25న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగడంతో కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ కొమురయ్య గురువారం మృతి చెందాడు. కుమారుడు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.